
సాక్షి కర్నూలు

శుక్రవారం : 3 : నవంబర్ : 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం బాపట్లకు చెందిన వెంకటేశ్వర్లు రూ.1,00,800 విరాళంగా అందజేశారు.



నూతన అధ్యాయం

రాయలసీమ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలను బలోపేతం చేస్తూ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. IIలో▸



8,276 క్యూసెక్కులు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి గురువారం దిగువ ప్రాంతాలకు 8,276 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 67 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

శ్రీమఠం.. భక్తిపారవశ్యం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంగారు కవచ ధారణలో రాఘవేంద్రుల మూల బృందావనం దర్శనం చేసుకున్నారు. ఊంజల మంటపంలో రాఘవేంద్రుల బృందావన ప్రతిమకు శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీమఠం వీధుల్లో ఊరిగించారు. ఏర్పాట్లను శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ పర్యవేక్షించారు.

నేడు ఎన్‌సీఏఈఆర్ బృందం రాక

- ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో సర్వే

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఎస్సీ విద్యార్థులకు విడుదల చేసిన ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించేందుకు ఎన్‌సీఏఈఆర్ (నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రీసర్చ్) కో ఆర్డినేటర్ మహమ్మద్ హబీబుద్దీన్ నేతృత్వంలోని బృందం శుక్రవారం జిల్లాకు రానుంది. ఇప్పటికే జిల్లాలో ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి 13 జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలను ఎంపిక చేశారు. అలాగే పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి 26 సాంఘిక సంక్షేమ గురుకులాలు, నర్సింగ్, జూనియర్, డిగ్రీ కళాశాలలను ఎంపిక చేశారు. ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాలకు సంబంధించిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 రేషియోలో విడుదల చేస్తున్నాయి. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను అర్హులైన ఎస్సీ విద్యార్థులకు నేరుగా విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ ఉపకార వేతనాల పరిశీలనకు ఈ బృందం నేడు జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సర్వే నిర్వహించనుంది.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని హిజ్రాలు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో కోరారు. తమ పరిధిలోని సచివాలయం, ఓటరు హెల్ప్ లైన్ యాప్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు.

ఆదోని యార్డులో రైతులకు భోజన వసతి

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నుంచి రైతులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ఇస్కాన్ సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు రూ.15 చెల్లించి భోజనం చేయవచ్చన్నారు. ఇస్కాన్‌కు యార్డు తరఫున రూ.20 చెల్లిస్తామని చెప్పారు. బయట హోటల్‌లో రూ.70 నుంచి రూ.100 వరకు డబ్బు చెల్లించినా సరిగా కడుపు నిండదన్నారు. యార్డులో ప్రభుత్వం నిర్ణయించిన రూ.15 ధరకే కడుపునిండా భోజనం చేయవచ్చన్నారు.

డిసెంబర్ 10న ఉచిత కృత్రిమ చేతుల శిబిరం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని శారీరక దివ్యాంగులకు మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ చేతుల శిబిరం ఈ ఏడాది డిసెంబర్ 10న నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా తెలిపారు. ఎలెన్ మెడోస్ ప్రోస్తెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ శిబిరం ఏర్పాటవుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు మోచేయి కింద కనీసం 4 అంగుళాల చేయి కలిగిన వారు ముందస్తుగా 7207403150 నెంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రూ.36 వేల విలువ చేసే ఎల్ఎన్4 కృత్రిమ చేయిని ఎలెన్ మెడోస్ ప్రోస్తెటిక్ ఫౌండేషన్ వారు అమెరికా నుంచి దిగుమతి చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్న దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు.

జిహ్వా చేపల్యం

- చేపల వినియోగాన్ని పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- నేటి నుంచి ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్
- కర్నూలులో మూడు రోజుల పాటు నిర్వహణ
- రూ.399తో చేపలు, రొయ్యల వంటకాలు తినే అవకాశం





ఉట్టి మీద కూడు ఉప్పు చేప తోడు వడ్డించవా నాకు.. అంటూ ఓ సినిమాలో గీతం ప్రేక్షకులను అలరించింది. అలాగే ప్రజల జిహ్వ 'చేప' ల్యాన్ని తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని రకాల చేపలు, రొయ్యల వంటలు లభించనున్నాయి. చేపల, రొయ్యల పులుసు.. ఫిష్ బాల్స్, ఫిష్ పింగర్స్, ఫిష్‌కట్‌లైట్, వడియాలు, ఫిష్ పిల్లెట్స్, ఫిష్ వేఫర్స్, ఫిష్ పేస్ట్, నూడిల్స్, సమోసా, ఫ్రైసూప్ తదితర వంటకాలు నోరూరించనున్నాయి.



కర్నూలు(అగ్రికల్చర్): చేపలు, రొయ్యల్లో మాంసకృత్తులతో పాటు శరీరానికి మేలు చేసే గుణాలు ఎన్నో ఉన్నాయి. హృద్రోగులకు, అస్తమా, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇవి మంచి ఆహారంగా పని చేస్తున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేపలు, రొయ్యల వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్లు ఏర్పాటు చేయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రజలకు సముద్రపు చేపలు, నదుల్లో లభించే చేపలు, రొయ్యలను అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. ఇప్పటికే విజయవాడ, నెల్లూరులో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. తాజాగా రాయలసీమ జిల్లాలకు సంబంధించి కర్నూలులో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో రావూస్ గార్డెన్‌లో ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ మౌర్య, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

రూ.399తో అన్‌లిమిటెడ్‌గా ఆరగించే అవకాశం...

ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో బఫే పద్ధతిలో ఫుడ్ కోర్టు నిర్వహించనున్నారు. రూ.399 చెల్లిస్తే చేపలు, రొయ్యల వంటకాలను అన్ లిమిటెడ్‌గా ఆరగించే అవకాశాన్ని మత్స్యశాఖ కల్పిస్తోంది. ఫెస్టివల్‌లో అనేక రకాల వంటకాలు నోరూరించనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రజలకు ఉప్పునీటి, మంచినీటి చేపలు, రొయ్యలు అందుబాటులోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై ఇక్కడ సెమినార్లు నిర్వహించనున్నారు. చేపలు, రొయ్యల్లో ఉండే పోషకాలు, వాటిని వినియోగించడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించనున్నారు. బతికిన అన్ని రకాల చేపలతో మ్యూజియం కూడా ఏర్పాటు చేయనున్నారు. మత్స్యశాఖ, ఫిష్ ఆంధ్ర కింద వివిధ యూనిట్లు నడుపుతున్న వారితో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో చేపలు, రొయ్యలకు సంబంధించిన స్నాక్స్ లభిస్తాయి. మొదటిసారిగా కర్నూలులో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా మత్స్యశాఖ అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

వినియోగం పెంచేలా..

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నేడు సముద్రపు చేపలు కూడా పట్టణ, గ్రామీణ ప్రజల ముంగిటకు వచ్చాయి. మత్స్యశాఖ మూడేళ్ల క్రితం చేపట్టిన సర్వే ప్రకారం మాంసాహారులు ఒక్కొక్కరు ఏడాదికి సగటున 8 కిలోల వరకు మాత్రమే చేపలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా చేపలు, రొయ్యల వినియోగం బాగాపెరిగింది. సగటు వినియోగాన్ని 20 కిలోలకు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది.

చేపలతో ఇవీ లాభాలు..

- చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో ఉండే ట్రై గ్లిజరైడ్లను తగ్గిస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.
- చేపలను తరచూ తినడం వల్ల వాటిల్లో ఉండే డోపమైన్, సెరొటోనిన్ అనే హార్మోన్లు డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని పరిశోధనల్లో వెల్లడైంది.
- చేపల్లో అన్ని రకాల పోషకాలు.. ప్రొటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మినరల్స్ లభిస్తాయి. విటమిన్ ఏ, విటమిన్ డీతోపాటు పాటు ఫాస్ఫరస్ వంటి పోషకాలు వీటి నుంచి మనకు అందుతాయి.
- చేపల్లో ఉండే విటమిన్ బీ2 రైబోఫ్లావిన్ మన శరీరానికి ఎంతో మేలుచేస్తుంది. శరీరం ఆక్సిజన్ తీసుకునేలా సహకరిస్తుంది.
- వ్యాధి నిరోధకశక్తి పెరుగాలన్నా, కడుపులో మంట, వేడి తగ్గాలన్నా చేపలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు.
- అర్థరైటీస్ సమస్యతో బాధ పడేవారికి చేపలు సరైన మందు.
- అల్జీమర్, డియోన్షియా, మతిమరపు లాంటి లక్షణాలను తగ్గిస్తాయి.
- చేపల్లోని ఐరన్... రక్తంలో హిమోగ్లోబిన్ సరిపడా ఉండేలా చేస్తుంది.
- పేగుల్లో గ్యాస్, ఇతరత్రా సమస్యలు రావు.



మన చేప, మన చేప

చేపలు, రొయ్యల వినియోగం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వివిధ పథకాలను అమలు చేస్తోంది. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర నినాదంలో రిటైల్ చేపల అమ్మకం కేంద్రాల ఏర్పాటు చేయిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 60 రిటైల్ ఫిష్ అవుట్‌లెట్స్ ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా సముద్రపు చేపలతో పాటు అన్ని రకాల చేపలు, రొయ్యలు అందుబాటులోకి వచ్చాయి. ఫిష్ రెస్టారెంట్లు, లాంజ్‌లు ఏర్పాటు చేయిస్తోంది. ఆదోనిలో రూ.కోటితో ఆక్వా హబ్ ఏర్పాటుకు ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. హబ్‌లో అన్ని రకాల చేపలు, రొయ్యలు, పీతలు ఉంటాయి. ఇక్కడ ప్రాసెసింగ్ చేసి జిల్లా నలుమూలలకు సరఫరా చేస్తారు. ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు 60 శాతం సబ్సిడీ, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో రూ.10 లక్షలు, రూ.20 లక్షలు, రూ.50 లక్షలు యూనిట్లు మంజూరు చేస్తున్నారు.

ఆదరణ పెరుగుతోంది



మత్స్యశాఖ ద్వారా మేం కర్నూలులోని ఖానాఖజానాలో డిలిషియస్ యూనిట్ ఏర్పాటు చేశాం. యూనిట్ కాస్ట్ రూ.10 లక్షలు ఉండగా ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇచ్చింది. వినియోగదారులు బాగా వస్తున్నారు. చేపలు, రొయ్యల వంటకాలకు ఆదరణ పెరుగుతోంది. రావూస్ గార్డెన్‌లో కూడా స్టాల్ పెడుతున్నాం.

– ఆర్.లక్ష్మీరంగన్న, కల్లూరు

ప్రవేశం ఉచితం



ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రవేశం పూర్తిగా ఉచితం. బఫె ఫుడ్ కోర్టులో రూ.399పై చేపలు, రొయ్యల వంటకాలను ఎంతైనా తినవచ్చు. చేపలు, రొయ్యల వినియోగం పెంచడమే లక్ష్యంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఇప్పటికే చేపలు, రొయ్యల వినియోగం బాగా పెరిగింది.

– శ్యామల, ఉప సంచాలకులు, మత్స్యశాఖ



నందికొట్కూరు పట్టణంలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ

మృతి చెందిన తమ కుటుంబీకుల ఆత్మలు శాంతించాలని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు గురువారం భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రైస్తవులు తమ పెద్దల సమాధులను పుష్పాలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నందికొట్కూరులో జరిగిన ప్రార్థనల్లో మతపెద్దలు రెవరెండ్ జాన్, ఉత్తమ్ పాల్గొన్నారు.

– నందికొట్కూరు

చురుగ్గా పింఛన్ల పంపిణీ

- కర్నూలు జిల్లాలో 90.03 శాతం పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నవంబర్ నెల వైఎస్ఆర్ పెన్షన్ కానుక పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. బుధవారం సాంకేతిక సమస్యల వల్ల పింఛన్ల పంపిణీ కాస్త మందగించింది. గురువారం ఉదయం నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు కొత్త, పాత పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కర్నూలు జిల్లాలో 2,46,122 పింఛన్లు ఉండగా.. సాయంత్రం 6 గంటల సమయానికి 2,21,589 పింఛన్లు పంపిణీ చేశారు. 90.03 శాతం పూర్తయింది. నంద్యాల జిల్లాలో 2,22,277 పింఛన్లు ఉండగా 2,02,585 పింఛన్లు పంపిణీ అయ్యాయి. 91.14 శాతం పంపిణీ పూర్తయింది. పంపిణీని మండలాల్లో ఎంపీడీఓలు, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు.



కర్నూలు సర్వజన వైద్యశాలలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం



తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా తిరువీధి ఉత్సవం



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి చతరుస్థానార్చన, హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను యాగశాల నుంచి గర్భాలయానికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. అనంతరం కుంభ ప్రోక్షణం నిర్వహించి కార్యక్రమాలను ముగించారు.

పారిశుధ్యం 'పల్లె'వించేలా..!

- గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు
- ప్రతి మంగళ, గురు, శనివారాల్లో నిర్వహణ
- అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు
- పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, పీఎస్‌లు

కర్నూలు(అర్బన్): ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్య రహదారులు, సందుల్లో, కుండీల వద్ద ఎక్కడా కూడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజు చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా మూడు రోజులు (మంగళ, గురు, శనివారాలు) ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీకి ఉదయం 8 గంటలకే చేరుకుంటున్నారు. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయిస్తున్నారు. ప్రతి వారంలో ఈ మూడు రోజులు పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రధాన గ్రామ పంచాయతీతో పాటు మజరా గ్రామాలను పరిశీలించాల్సి ఉంది. అలాగే ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న మూడు రోజుల్లో కనీసం రెండు గ్రామ పంచాయతీలను విజిట్ చేయాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలోని విధులు నిర్వహిస్తున్న అధికారులు చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది.



పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న దృశ్యం

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు ...

పల్లెల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పలు కార్యక్రమాలను చేపట్టారు. ముఖ్యంగా వీధులు, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, పక్షం రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, నీటిని క్లోరినేషన్ చేయడం వంటి చర్యలను చేపట్టారు. ఇప్పటికే పల్లెల్లో ఎలాంటి అంటురోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. అలాగే అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే గుంతల్లో నుంచి మురుగు నీటిని ఎత్తిపోయడం, అలా సాధ్యం కాకపోతే ఆ గుంతల్లో ల్యారీసైడ్, అబేట్, బేటెక్స్ (క్రిమి సంహారక మందులు)లను పిచికారీ చేస్తున్నారు. రెగ్యులర్ కార్యక్రమలతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తున్నారు.

షెడ్లకు తరలిస్తూ..

గ్రామీణ ప్రాంతాల్లోని వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లకు తరలించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన క్లాప్ మిత్ర, షెడ్‌మిత్రలకు ఆయా గ్రామ పంచాయతీల్లోని నిధుల లభ్యతను అనుసరించి వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మేజర్ గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాక్టర్లు లేని ప్రాంతాల్లో ఆటోల ద్వారా చెత్తను ఎత్తివేస్తూ వీధులను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు.

అశ్రద్ధ కనబరిస్తే చర్యలు



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధ కనబరిచినా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించి డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేశాం.

– టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ. 1,01,500 నగదు, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసనాయక్

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రైల్వేగేట్ అవతల పాతబడిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ గురువారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని కొడల్‌పేటకు చెందిన ఇర్ఫాన్‌ఖాన్, వెంకటన్నపేటకు చెందిన మేస్త్రీ ఖాసీం..క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ నాటుసారా అమ్ముతున్నారని పక్కా సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1,01,500 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, 10 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

దేవస్థానం కాలనీలో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న స్నేక్‌క్యాచర్ మోహన్

మహానంది: మహానందిలోని దేవస్థానం కాలనీ ప్రాంగణంలో గురువారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. రోడ్డు దాటుతూ కాలనీలోకి వస్తున్న కొండచిలువను చూసిన భక్తులు, స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు వెంటనే అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించడంతో కొండచిలువను పట్టుకుని నల్లమల అడవిలో వదిలేశారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెట్రోడ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ జేకేసీ, కెమెస్ట్రీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాలో ప్రొడెక్షన్, క్యూబార్ ఏఅండ్ఏ బార్ సీ, ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లలో ఉద్యోగాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం, బీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, ఐటీఐ, ఫిట్టర్, డిప్లొమో, మెకానికల్ కోర్సులు 2020- 23 మధ్య కాలంలో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అంతేగాక హెట్రోడ్రగ్స్ కంపెనీ రాత పరీక్ష ద్వారా ఉద్యోగులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 6305580167, 7799337695ను సంప్రదించాలన్నారు.

ఉన్నత విద్యలో నూతన అధ్యాయం

- వర్సిటీల్లో ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
- ఆర్‌యూలో 103, ఉర్దూ వరిటీలో 63 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- కొత్త పోస్టుల భర్తీతో ఊపందుకోనున్న పరిశోధనలు



రాయలసీమ యూనివర్సిటీ



ఉర్దూ యూనివర్సిటీ

కర్నూలు (సెంట్రల్): విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తూ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీలో 103, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 63 ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఆయా వర్సిటీల్లో నూతన అధ్యాయం మొదలు కానున్నది. రాయలసీమ యూనివర్సిటీ 2008లో ఎనిమిది మంది ప్రొఫెసర్లు.. ఆరు కోర్సులతో ప్రారంభమైంది. ప్రస్తుతం ఏడుగురు ప్రొఫెసర్లు, 18 కోర్సులు వర్సిటీలో ఉన్నాయి. అయితే ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను భర్తీ చేయాల్సి ఉన్నా టీడీపీ హయాంలో పట్టించుకోలేదు. దీంతో 53 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకొని బోధన చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌యూలో 103 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో 101 టీచింగ్, రెండు నాన్ టీచింగ్ పోస్టులు ఉన్నాయి. ప్రొఫెసర్ 11, అసోసియేట్ ప్రొఫెసర్ 28, అసిస్టెంట్ ప్రొఫెసర్ 62 పోస్టులు ఉన్నాయి.

ఏడేళ్ల నుంచి రెగ్యులర్ పోస్టు లేదు

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని 2016లో స్థాపించారు. అయితే అప్పటి ప్రభుత్వం ఉర్దూ యూనివర్సిటీ కర్నూలులో పెట్టామని చెప్పడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. విద్యా బోధన కోసం ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం వర్సిటీలో 9 పీజీ, 5 డిగ్రీ కోర్సులు ఉన్నాయి. ఆయా కోర్సుల బోధన కోసం 14 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకున్నారు. ప్రస్తుతం 63 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఇందులో 36 అసిస్టెంట్, 18 అసోసియేట్, 9 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి.

టీడీపీ హయాంలోనే హడావుడి

2014 నుంచి 2019 కాలం మధ్యలో వర్సిటీల్లోని ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి హడావుడి చేశారు తప్ప ప్రణాళికతో ముందుకెళ్లదు. దీంతో కోర్టు కేసులు, ఇతర వివాదాలతో పోస్టుల భర్తీ నిలిచిపోయింది. ఆయా చిక్కులను విడిపించాలన్న ఉద్దేశం అప్పట్లో కనిపించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నత విద్యలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. డిగ్రీ స్థాయిలో ఉద్యోగ విద్యను ప్రవేశపెట్టారు. అంతేకాక వివాదాలతో నిలిచిపోయిన ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకొని నోటిఫికేషన్‌ను విడుదల చేయించారు. ఆయా పోస్టులకు నవంబర్ 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవడానికి అభ్యర్థులకు గడువు ఇచ్చారు.

పరిశోధనలకు మంచి కాలం

ప్రొఫెసర్ పోస్టులు భర్తీ అయితే రాయలసీమ, ఉర్దూ యూనివర్సిటీల్లో పరిశోధనలకు మంచి ఊపు వస్తుంది. ప్రస్తుతం సరైన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో పరిశోధనలకు ఇబ్బందిగా ఉంది. దీంతో జిల్లాకు చెందిన చాలా మంది విద్యార్థులు పక్క జిల్లాల్లోని వర్సిటీలను ఎంచుకోవాల్సి వస్తోంది. అక్కడ వారు కొన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అదే రాయలసీమ, ఉర్దూ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు ఉంటే వారి గైడెన్స్‌లో ఇక్కడే పరిశోధనలు చేసుకోవచ్చు. ఈ పరిశోధనల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను పొందేందుకు వీలు ఉంటుంది.

మంచి రోజులు వచ్చాయి



యూనివర్సిటీలకు మంచి రోజులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నాం. ప్రభుత్వం స్పందించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. ఆర్‌యూ పరిధిలో 103, ఉర్దూ యూనివర్సిటీ పరిధిలో 63 పోస్టులను భర్తీ చేస్తే నూతన అధ్యాయం మొదలు అవుతుంది. వర్సిటీలు పరిశోధనలకు నిలయంగా మారుతాయి.

–ప్రొఫెసర్ ఆనందరావు, వీసీ, ఆర్‌యూ

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- జిల్లా కలెక్టర్ సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కర్నూలు నగరానికి తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు, టీబీ డ్యామ్‌ల నుంచి నీటిని తెప్పించేందుకు ఇరిగేషన్ శాఖ సెక్రటరీతో తాను మాట్లాడతానని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కర్నూలు నగరానికి నీటి సరఫరా, రానున్న రోజుల్లో నీటి ఎద్దడి నివారణపై ఆమె కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కమిషనర్ భార్గవ్‌తేజతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..టీబీ డ్యామ్, గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా సమయంలో రైతులు జల చౌర్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం రైతులకు తాగునీటి ఇబ్బందులను వివరించి వారిలో మార్పు తెచ్చేందుకు పోలీసు, విద్యుత్ శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద రైతులు వరి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటిని ప్రజలు జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా నీటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుంకేసుల నుంచి కర్నూలు వరకు జరుగుతున్న పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇన్‌టేక్ వెల్ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, టౌన్ డీఎస్పీ రాజశేఖర్, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదు పాల్గొన్నారు.

లింగనిర్ధారిత వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ డాక్టర్ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): లింగనిర్ధారిత వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ కార్యాక్రమాన్ని రానున్న ఐదు నెలల్లో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. గురువారం డివిజినల్ డీడీలు, ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలతో కలెక్టరేట్‌లోని గోకులం సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగనిర్ధారిత వీర్యంతో 99 శాతం పెయ్య దూడలే పుడుతాయని, వీటికి రోజుకు 18 లీటర్ల పాలు ఇచ్చే సామర్థ్యం ఉంటుందన్నారు. మార్చిలోపు 3వేల పశువులకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయాలనేది లక్ష్యమన్నారు. వీర్యం పూర్తి ధర రూ.1,350 ఉంటుందని, సబ్సిడీ పోను రైతులు రూ.500 చెల్లించాలని తెలిపారు. మొదటిసారి వేసిన డోస్ వల్ల పశువులు చూలు కట్టకపోతే రెండో డోసు ఉచితంగా వేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్, కర్నూలు, ఆదోని డీడీలు దుర్గాప్రసన్నబాబు, వెంకటరమణ, పాలీక్లినిక్ డీడీ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రీసర్వేకు సంబంధించిన గ్రౌండ్ ట్రూతింగ్, వ్యాలిడేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో దశ రీసర్వే పనులకు సంబంధించి ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెల 20లోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 360 ఎల్‌పీఎలను జనరేషన్ చేసినట్లు జేసీ నారపురెడ్డి మౌర్య ఆయనకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర జి.సృజన, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ నాగప్రసన్న లక్ష్మీ పాల్గొన్నారు.

పొరపాట్లపై ఆధారాలతో ఫిర్యాదు చేయండి



రాయలసీమ యూనివర్సిటీని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): ముసాయిదా ఓటరు జాబితాలోని పొరపాట్లపై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ వరకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. పేర్లు, చిరునామాలు, ఇతర మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందన్నారు. జిల్లాలో అక్టోబర్ 16 నుంచి ప్రారంభమైన ఎఫ్ఎల్‌సీ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక పాల్గొనాలని, ఓటింగ్ ప్రక్రియలో ఏమైనా అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా నవంబర్ 4, 5.. డిసెంబర్ 2, 3 తేదీల్లో చేపట్టే ప్రత్యేక ఓటరు శిబిరాల వివరాలను ప్రజలకు తెలిసే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో మల్లికార్జునుడు, వైఎస్సార్‌సీపీ నుంచి కర్నాటి పుల్లారెడ్డి, కాంగ్రెస్ తరపున బీటీ స్వామి, టీడీపీ నుంచి ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌యూలో భవనాల పరిశీలన

సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటుకు రాయలసీమ యూనివర్సిటీలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ భవనాలను పరిశీలించారు. కర్నూలు ఎంపీ, జిల్లాలోని 8 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను రాయలసీమ యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వర్సిటీలోని అన్ని భవనాలకు సంబంధించిన లేఅవుట్ ప్లాన్లను తనకు మూడురోజుల్లో సమర్పించాలని కల్లూరు తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్, ఎస్పీలు ప్రభుత్వ ముద్రణాలయాన్ని పరిశీలించారు. ముద్రణాలయ కేంద్రం పైకప్పు పెచ్చులూడి పడిపోతుండడంతో పునర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజును కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో జరుగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అక్కడ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో మల్లికార్జునుడు, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, ప్రభుత్వ ముద్రణాలయ ఇన్‌చార్జి మేనేజర్ చంద్రశేఖర్, కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఈ-స్టాంపింగ్ సేవలను మరింత విస్తరిస్తాం



ఈ-స్టాంపింగ్ పత్రాలను అందజేస్తున్న ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ-స్టాంపింగ్ సేవలను ప్రస్తుతం కృష్ణానగర్, డీసీసీబీ ప్రధాన కార్యాలయం బ్రాంచ్, ఆదోని శాఖల్లో అందుబాటులోకి తీసుకొచ్చామని, నెలాఖరులోపు అన్ని బ్రాంచీలకు విస్తరిస్తామని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. గురువారం ఆమె జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రధాన కార్యాలయంలో సీఇఓ పి.రామాంజనేయులు, పాలకవర్గం సభ్యులతో కలసి ఈ-స్టాంపింగ్ సేవలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సహకార సమైక్య డిపాజిట్ పథకంలో భాగంగా కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్(సీఎస్‌ఏ) జీరో బ్యాలెన్స్‌తో ప్రారంభిస్తామన్నారు. ఈ ఖాతాలపై ఒక సంవత్సరానికి అర్హత మేరకు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన(పీఎంఎస్‌బీవై) కల్పించడంతో పాటు, ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా ఏటీఎం కార్డు జారీ చేస్తామన్నారు. సీఇవో పి.రామాంజనేయులు మాట్లాడుతూ విజిలెన్స్ వారోత్సవాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యుడు వెంకటరమణారెడ్డి, డీజీఎంలు సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీపీడీఎం సహిదా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 5 నుంచి మంత్రి బుగ్గన పర్యటన

డోన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 5వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే పలు కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొననున్నారు. 5న డోన్ మండలం చిన్నమల్కాపురంలో రెండు గ్రామ సచివాలయ భవనాలు, రెండు రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారు. 6న బేతంచెర్ల నుంచి డోన్, బనగానపల్లె వరకు నిర్మించిన ఆర్ అండ్‌బీ రహదార్లను ప్రారంభిస్తారు. ఇదే రోజు హెచ్. కొట్టాలలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారు. 7న డోన్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాలను ప్రారంభిస్తారు. అనంతరం కర్నూలు మున్సిపల్ ఆఫీసు చేరుకుని కోడుమూరు, పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 8న డోన్ పట్టణంలో నిర్మించ తలపెట్టిన కాపు భవనం నిర్మాణానికి భూమి పూజ చేస్తారు.

పత్తి రైతుకు 'మద్దతు'

- సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు
- గతనెల 25 నుంచే కొనుగోళ్లు ప్రారంభం



యార్డుకు తరలించిన పత్తి దిగుబడులు

ఆదోనిఅర్బన్: పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో రెండు కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆలూరు రోడ్డులోని జయంత్‌కాటన్ ట్రేడర్స్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లు, సిరుగుప్ప రోడ్డులోని ఎన్‌డీబీఎల్ పరిశ్రమల్లో గత నెల 25వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను రూ.7,020గా నిర్ణయించింది. సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్మాలనుకునే రైతులు కచ్చితంగా తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు పట్టాదారు పాసు పుస్తకం నకలుతో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకొని టోకెన్ పొందాలి. ఆ తర్వాత సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకెళ్లాలి. నాణ్యతా ప్రమాణాల మేరకు పంట ఉంటేనే అధికారులు కొనుగోలు చేస్తారు.

నిబంధనలు ఇవీ...

- పత్తిని ఆరబెట్టి శుభ్రపరిచి తీసుకురావాలి.
- తేమ 8 శాతం ఉండాలి. అంతకంటే ఎక్కువగా ఉంటే ఒక్కో శాతానికి రూ.55.50 చొప్పున ధర తగ్గుతుంది.
- పత్తి పింజ పొడవు 29.50 ఎం.ఎం. నుంచి 30.50 ఎం.ఎం. వరకు ఉండాలి.
- మైక్రోనెయిర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలి.
- వర్షానికి తడిచిన పత్తిని తీసుకురాకూడదు.
- దుమ్ము, ధూళి, చెత్త చెదారాలు లేకుండా చూసుకోవాలి.
- గుడ్డి, రంగు మారిన, పురుగుపట్టిన పత్తి కాయలను వేరుచేసి తీసుకురావాలి.
- నీళ్లు చల్లిన పత్తిని కొనుగోలు చేయరు.
- కొడు, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలపకూడదు.

దళారులను నమ్మొద్దు



పత్తిని అమ్ముకునే రైతులు కచ్చితంగా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆదోని పట్టణంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశాం. రైతులు మద్దతు ధరను వినియోగించుకోవాలి. నాణ్యత ప్రమాణాలు పాటించి పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకురావాలి. కేంద్రాల వద్ద మధ్యవర్తులను, దళారులను నమ్మవద్దు

– రామ్మోహన్‌రెడ్డి, యార్డు సెక్రటరీ

అర్హులను ఓటర్లుగా నమోదు చేయించండి

కర్నూలు(సెంట్రల్): 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్ నుంచి ఓటరు జాబితా సవరణ, రీసర్వే, ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకంపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మండలాల ప్రత్యేకాధికారులు, హౌసింగ్ ఇంజినీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటును ముమ్మరం చేయాలన్నారు. ప్రతి రోజూ ఒక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సదుపాయాలను పరిశీలించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా చూసుకోవాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులను నవంబర్ 20 లోపు పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో మల్లికార్జునుడు, ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మీ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

ఆనందాల 'మార్గం'

- దశాబ్దాల తర్వాత కొత్తపల్లికి రోడ్డు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కొత్తపల్లెకు రోడ్డు వేస్తున్న దృశ్యాలు

కోడుమూరు: తమ ఊరికి రోడ్డు వేస్తారని వారు కలలో కూడా ఊహించలేదు. దశాబ్దాలుగా ఇబ్బందులను తొలగిస్తూ రహదారి నిర్మాణం సాగుతుండటంతో వారి ఆనందం ఇంతా అంతా కాదు. కోడుమూరు, కృష్ణగిరి మండలాలకు సరిహద్దుగా ఉండే కొత్తపల్లె వాసుల కథ ఇదీ.. గోరంట్ల హంద్రీనది ఒడ్డున ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామం వెలసినప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు మార్గంలేదు. ఊరిలో 180 గడపలు ఉండగా.. 500 మంది నివాసం ఉంటున్నారు. రోడ్డు మార్గం లేక ప్రజలు హంద్రీనదిని దాటి కోడుమూరుకు చేరుకోవాల్సిన దుస్థితి. భారీ వర్షాల సమయంలో గోరంట్ల హంద్రీనది పొంగితే మన్నెగుంట, ఎర్రగుడి, కృష్ణాపురం గ్రామాల మీదుగా 15 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. పట్టణ ప్రాంతాలకు సంబంధాలు లేక అనాగరిక జీవితాలను గడిపేవారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రగా నడుచుకుంటు వస్తూ గోరంట్ల హంద్రీపై బ్రిడ్జిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసి పనులు వేగవంతంగా చేస్తున్నారు. రోడ్డు ఏర్పాటు అవుతుండటంతో కొత్తపల్లె గ్రామస్తుల ఆనందం అంత ఇంతా కాదు. గ్రామస్తులు ఎవరిని పలకరించినా ఊరికి స్వతంత్ర్యం వచ్చిన రీతిలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గోరంట్ల హంద్రీపై బ్రిడ్జితో పాటు కొత్తపల్లె వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 24 కోట్లను విడుదల చేసింది. 2024 చివరి నాటికి పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో రోడ్డు పనులను శరవేగంగా అధికారులు జరుపుతున్నారు.

సంతోషంగా ఉంది



నా చిన్న తనం నుంచి కూడా మా ఊరికి రోడ్డు వస్తే చూడాలని ఉండేది. మా ఊరికి రోడ్డు వేసేందుకు ఏ నాయకుడు గాని, ఏ పార్టీ గాని ముందుకు రాలేదు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా మా ఊరికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయడం, రోడ్డు నిర్మాణ పనులు కూడా చకా చకా జరుగుతుండడం ఎంతో సంతోషంగా ఉంది.

– వెంకప్ప, కొత్తపల్లె

రోడ్డును చూస్తాననుకోలేదు



ఊహ తెలిసినప్పటి నుంచి నడుచుకుంటూ గోరంట్లకు వచ్చి అక్కడి నుంచి వాహనాల్లో వెళ్లేవాళ్లం. దీనివల్ల ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. మా ఊరికి రోడ్డును చూస్తాననుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని మా ఊరికి రోడ్డు వేస్తుండడం చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మన్న, కొత్తపల్లె

సాక్షి బిజినెస్

శుక్రవారం
3-11-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
490	144
64,081	19,133

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్‌	13,260	▲ 199
డోజోన్స్‌	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్‌	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్‌	31,950	▲ 348

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲ 80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲ 79
వెండి (కేజీ)	71,684	▲ 700

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	82.49	84.26
£	బ్రిటన్‌ పౌండ్‌	99.73	101.94
€	యూరో	86.78	89.19
¥	జపాన్‌ ఎన్‌ (100)	54.27	55.87
AUS$	ఆస్ట్రేలియా డాలర్‌	51.63	54.39
S$	సింగపూర్‌ డాలర్‌	59.12	60.98
SAR	సౌదీ రియాల్‌	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్‌	21.87	23.49
¥	చైనా యువాన్‌	10.23	12.29

పోస్ట్‌ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్‌ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్‌ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్‌ పోస్ట్‌ లేదా టీఎల్‌ఆర్‌ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్‌ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్‌ కావడానికి వీలుగా ఇన్సూర్డ్‌ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్‌ డైరెక్టర్‌ రోహిత్‌ పి. దాస్‌ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్‌ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్‌ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్‌ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్‌ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్‌ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్‌ 7 వరకు అందించాయి. అక్టోబర్‌ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్‌ ఇన్సూ్యరెన్స్‌లో 'జ్యూరిక్‌'కు వాటాలు

51% కొనుగోలు; డీల్‌ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్‌ జనరల్‌ ఇన్సూ్యరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్‌ ఇన్సూ్యరెన్స్‌ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్‌ ఇన్సూ్యరెన్స్‌ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్‌ మహీంద్రా బ్యాంక్‌ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్‌ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్‌ సీఈవో (ఆసియా పసిఫిక్‌) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్‌ జనరల్‌ ఇన్సూ్యరెన్స్‌ ఎండీ దీపక్‌ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్‌-లైఫ్‌ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.

ఫ్యాషన్‌ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్‌ టు కస్టమర్‌ ఫ్యాషన్‌ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్‌ ఈ–కామర్స్‌ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్‌ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్‌ వంటి ఉత్పత్తులను డైరెక్ట్‌ టు కన్సూ్యమర్‌ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్‌ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్టు వెల్లడించింది. ఈ బ్రాండ్స్‌ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్టు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్‌ నాడార్‌ టాప్‌

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్‌ హురున్‌ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్‌ టెక్నాలజీస్‌ చీఫ్‌ శివ్‌ నాడార్‌ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్‌ హురున్‌ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్‌ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ సీఎండీ ముకేశ్‌ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్‌ చీఫ్‌ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్‌ అధినేత గౌతమ్‌ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్‌ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్‌ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్‌ ఇండియా చీఫ్‌ రీసెర్చర్‌ అనాస్‌ రెహ్మాన్‌ జునైద్‌ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్‌ కుటుంబంతో పాటు సైరస్‌ ఎస్‌ పూనావాలా, అదార్‌ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్‌ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ–వ్యవస్థాపకుడు నిఖిల్‌ కామత్‌ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్‌ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్‌అండ్‌టీ గౌరవ చైర్మన్‌ ఏఎం నాయక్‌ .. ప్రొఫెషనల్స్‌ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్‌ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్‌ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్‌ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ (బీపీసీఎల్‌)తో గెయిల్‌ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్‌ ప్లాంటుకు బీపీసీఎల్‌ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్‌ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్‌ దేశీయంగా తొలి ప్రొపేన్‌ డీహైడ్రోజినేషన్‌ (పీడీహెచ్‌) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్‌ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్‌ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్‌' బూస్ట్‌!

- ఫెడరల్‌ రిజర్వ్, బ్యాంక్‌ ఆఫ్‌ ఇంగ్లండ్‌ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్‌
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్‌
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్‌ రిజర్వ్‌ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్‌ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్‌ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్‌ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్‌ లభించింది. దీంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్‌ రిజర్వ్‌ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్‌ ప్రభుత్వం 113 బిలియన్‌ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్‌ ఆఫ్‌ ఇంగ్లండ్‌ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్‌ మార్కెట్లు 1–2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్‌ మార్కెట్లు 1–1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్‌ ర్యాలీతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌ 30 షేర్లలో టెక్‌ మహీంద్రా(1%), బజాజ్‌ ఫైనాన్స్‌(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్‌ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటోకార్ప్‌ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్‌

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్‌ఆర్‌ అమ్మకాలు జూమ్‌



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్‌(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్‌ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్‌ ల్యాండ్‌ రోవర్‌(జేఎల్‌ఆర్‌) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్‌ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్‌ఆర్‌ ఆదాయం 30 శాతం జంప్‌ చేసి 6.9 బిలియన్‌ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్‌ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్‌–మార్చి)లో హోల్‌సేల్‌ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్‌) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్‌ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్‌ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్‌ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

పంచతంత్రం

ర్యాలీలు, మీటింగులుండవ్‌!

బ్యానర్లు, నినాదాలు అస్సలుండవు • మిజోరంలో ప్రచారం రూటే వేరు

ఎన్నికలంటేనే బోలెడంత హడావుడి, ప్రచారం, సభలు, సందడి. మరీ ముఖ్యంగా మన దేశంలోనైతే ఆ ఊపే వేరు. కానీ మిజోరంలో మాత్రం ఈ పరిస్థితి ఎక్కడా కనిపించదు. పార్టీల ర్యాలీలు, భారీ బహిరంగ సభలు, రోడ్లను బ్లాక్‌ చేసేయడం వంటివి కాగడా వేసి వెదికినా ఎక్కడా కనిపించవు. అసలు రోడ్లపై గానీ, మరెక్కడైనా నినాదాలు విన్పించడం, బ్యానర్లు కన్పించడం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు!

ప్రచారమంతా చర్చి ఆధ్వర్యంలోనే...

మిజోరంలో అత్యంత బలమైనది చర్చి వ్యవస్థ. రాష్ట్రంలో పార్టీల ఎన్నికల ప్రచార ప్రక్రియ ఆసాంతం చర్చి ఆధ్వర్యంలో నడిచే మిజో పీపుల్స్‌ ఫోరం (ఎంపీఎఫ్‌) చర్చి కనుసన్నల్లోనే జరుగుతుంది. గత మూడు ఎన్నికల నుంచీ ఇది మరింతగా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.



ఏం చేస్తుంది?

- ఎంపీఎఫ్‌ అసెంబ్లీ స్థానాలవారీగా కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తుంది.
- ఆ నియోజకవర్గంలోని అందరు అభ్యర్థులూ అక్కడికే వస్తారు.
- తమ విధానాలు, పథకాలు తదితరాలను ఒక్కొక్కరుగా ప్రజల ముందు పెడతారు.
- ఇందుకు ఒక్కొక్కరికి 20 నిమిషాలు టైం కేటాయిస్తారు.
- ఏ గొడవలకు, ఉద్రిక్తతలకు తావులేకుండా కార్యక్రమం సాగుతుంది.

దేశమంతటా ఎన్నికల ప్రచారం ఇలాగే సాగాలంటూ చట్టం తెస్తే బాగుంటుందేమో కదా!

మహిళలకు మొండిచెయ్యే



అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, మిజోరంలకు రెండు ప్రత్యేక రికార్డులున్నాయి. రెండు మహిళలకు సంబంధించినవే కావడం విశేషం. అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్‌ నిలిస్తే, అత్యల్ప ప్రాతినిధ్యమున్న రాష్ట్రంగా మిజోరం చెత్త రికార్డును మూటగట్టుకుంది. దాని చరిత్రలో ఇప్పటిదాకా ఎమ్మెల్యేలైన మహిళల సంఖ్య కేవలం నాలుగే! ప్రస్తుత మిజోరం అసెంబ్లీలోనైతే ఒక్కరంటే ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేరు! అంతేకాదు, 2014 ఉప ఎన్నికలో నెగ్గిన వన్లాల్‌వాంపుయ్‌ చోంగ్తూను మినహాయిస్తే గత 27 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నికవలేదు! ఇక లోక్‌సభకైతే మిజోరం చరిత్రలోనే ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎన్నికవలేదు! ఇక ఇప్పటిదాకా ఇద్దరంటే ఇద్దరు మహిళలు మాత్రమే మంత్రులయ్యారు!

- మిజోరం అసెంబ్లీలో కానరాని స్త్రీలు
- దేశంలోకెల్లా అత్యల్ప ప్రాతినిధ్యం
- ఇప్పటిదాకా నలుగురే మహిళా ఎమ్మెల్యేలు
- లోక్‌సభకైతే మహిళల ప్రాతినిధ్యం సున్నా

ఆది నుంచీ...

కేంద్రపాలిత ప్రాంతం హోదాలో మిజోరంలో 1972లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేవలం నలుగురు మహిళలు మాత్రమే పోటీ చేశారు. వారిలో ఒక్కరూ నెగ్గకపోగా డిపాజిట్లు కూడా కోల్పోయారు. 1978లో ఎల్‌.థన్‌మావీ రూపంలో మిజోరంలో తొలిసారి ఒక మహిళ ఎమ్మెల్యేగా నెగ్గింది. ఆమెకు పడ్డ మొత్తం ఓట్లెన్నో తెలుసా? కేవలం 1,824. కేవలం 119 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారామె! అన్నట్టు, ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక మహిళ కూడా ఆమే. అనంతరం ఏడాది లోపే మళ్లీ జరిగిన ఎన్నికల్లోనూ నలుగురు పురుష అభ్యర్థులతో తలపడి కేవలం 42 ఓట్ల మెజారిటీతో మళ్లీ గెలిచారామె. ఆ ఎన్నికల్లో బరిలో దిగిన మరో ఇద్దరు మహిళలు డిపాజిట్‌ కోల్పోయారు. 1987లో మిజోరం రాష్ట్రంగా మారాక జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు మహిళలు పోటీ పడ్డారు. ఎంఎన్‌ఎఫ్‌ తరఫున లాల్‌హ్లాంపుయ్‌ మర్‌ ఐజ్వాల్‌ నార్త్‌–1 నుంచి కేవలం 306 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అనంతరం లాల్‌డెంగా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. మంత్రి అయిన తొలి మిజో మహిళగా రికార్డు సృష్టించారు. అనంతరం 1989, 1993 అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురేసి మహిళలు పోటీ చేసినా ఓటమి చవిచూశారు. 1998లో 10 మంది, 2003లో ఏడుగురు, 2008లో 9 మంది, 2013లో ఆరుగురు మహిళలు పోటీ చేసినా ఒక్కరూ నెగ్గలేదు. అలా 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2014లో ఉప ఎన్నికలో నెగ్గిన చోంగ్తూ కాంగ్రెస్‌ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. అయితే ఆమెకు దక్కింది... మత్స్య, సహకార శాఖలు! కానీ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో అత్యధికంగా 18 మంది మహిళలు పోటీ చేసినా ఒక్కరూ గెలుపు ముఖం చూడలేకపోయారు. పైగా ఏకంగా 16 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ఈసారి...

- ఎంఎన్‌ఎఫ్, కాంగ్రెస్, జోరాం పీపుల్స్‌ మూవ్‌మెంట్‌ (జెడ్‌పీఎం) ఇద్దరేసి మహిళలకు టికెట్లివ్వగా
- బీజేపీ ముగ్గురికిచ్చింది. మొత్తమ్మీద ఈసారి 16 మంది మహిళలు ఎన్నికల బరిలో దిగారు.

ఎందుకిలా...?

మిజోరంలో చట్టసభల్లో మహిళలకు అత్యల్ప ప్రాతినిధ్యానికి అక్కడి పితృస్వామ్య వ్యవస్థే ప్రధాన కారణమని చెబుతారు. పరిశీలిస్తే అది నిజమేననిపిస్తుంది కూడా. క్రైస్తవ జనాభా ఎక్కువగా ఉన్నా మిజోరం ప్రధానంగా గిరిజన రాష్ట్రం. సహజంగానే అక్కడ మహిళలకు ఇల్లు దాటికి బయటికి వెళ్లడాన్ని అంతగా ఇష్టపడరు.

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌





ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంప్రదాయక డోలు వాయిస్తున్న జార్ఖండ్‌ బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్‌ మరాండీ. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురీ నియోజకవర్గంలోని ఖుత్గావ్‌ పట్టణంలో తీసిందీ ఫొటో

ఛత్తీస్‌గఢ్‌ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

కాంగ్రెస్‌ ఉన్నచోట అభివృద్ధి ఉండదు

కాంకేర్‌: వారసత్వ రాజకీయాలు, అవినీతి, బంధుప్రీతికి మారుపేరైన కాంగ్రెస్‌ పార్టీకి అధికారమిస్తే అభివృద్ధి ఏమాత్రం జరగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. అవినీతికి పాల్పడుతోందంటూ సీఎం భూపేశ్‌ బఘేల్‌ ప్రభుత్వాన్ని ఎండగట్టిన ప్రధాని మోదీ..రాష్ట్రాన్ని దోచుకున్న వారిని ఏమాత్రం ఉపేక్షించరాదన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తమ ప్రభుత్వం రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళను ఎంపిక చేయగా దానిని కూడా కాంగ్రెస్‌ వ్యతిరేకించిందని ద్రౌపదీ ముర్మును ఎన్నికనుద్దేశించి ప్రధాని చెప్పారు. ఇలాంటి వైఖరి కలిగిన కాంగ్రెస్‌ పార్టీకి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి గిరిజనుడూ ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను మీరు శిక్షిస్తారా అని ప్రధాని ప్రశ్నించగా అవును అంటూ జనం బదులిచ్చారు. ఇతర వెనుకబడిన కులాని(ఓబీసీ)కి చెందినందునే 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ తనను దూషించిందని తెలిపారు. కేంద్రంలో అధికారం కోల్పోయాక పార్టీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో అవినీతితో ఖజానా నింపుకుంటోందని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసిందని, ఎన్నికల హామీలను నెరవేర్చ లేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సీఎం బఘేల్‌ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ కార్యాలయాన్ని కాంగ్రెస్‌ కమిటీ కార్యాలయంగా మార్చేసి, ప్రభుత్వంలో పెద్దల పిల్లలు, బంధువులకు ఉద్యోగాలిచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే బస్తర్‌ ప్రాంతంలోని పేదలు, దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజన కుటుంబాలకు హత్యలు, నేరాలు, హింస తప్ప ఏం లాభం కలిగింది? అని ప్రశ్నించారు. 'అందుకే, రాష్ట్రాన్ని దోచుకున్నవారు ఎంత శక్తిమంతులైనప్పటికీ వదలరాదు. దోచుకున్నదంతా వారి నుంచి కక్కిస్తాం. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలో ఉన్నచోట అభివృద్ధి ఉండదు'అని మోదీ అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును మోదీ, బీజేపీ చేసుకుంటాయని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధిని వేగవంతం చేసి, సుసంపన్నమైన ఛత్తీస్‌గఢ్‌కు పునాది వేస్తాం. రాష్ట్రాన్ని వచ్చే అయిదేళ్లలో దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. పీఎం ఆవాస్‌ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం'అని ప్రధాని ప్రకటించారు.

మెజారిటీ రాకున్నా సరే, బీజేపీని మాత్రం కలుపుకోం: జెడ్‌పీఎం

ఐజ్వాల్‌: ఈ నెల 7న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడంలో తమ పార్టీ విఫలమైనప్పటికీ, బీజేపీ మద్దతు మాత్రం తీసుకోబోమని జోరం పీపుల్స్‌ మూవ్‌మెంట్‌(జెడ్‌పీఎం) కుండబద్దలు కొట్టింది. జెడ్‌పీఎం వర్కింగ్‌ చైర్మన్‌ కె.సప్డంగ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజలు కొత్త ప్రభుత్వం, కొత్త పాలనా విధానం రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారు సంకీర్ణప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. ఎన్నికల తర్వాత మా పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకున్నా, బీజేపీ మద్దతు తీసుకోవడం, ఆ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదు'అని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జట్టుకట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల తర్వాత జెడ్‌పీఎం, అధికార ఎంఎన్‌ఎఫ్‌లలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీతో చేతులు కలుపుతామంటూ బీజేపీ చేసిన ప్రకటనపై పైవిధంగా సప్డంగ స్పందించారు. ఈ నెల 7న జరగనున్న ఎన్నికల్లో తమదే గెలుపని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.